# ఆచారాలూ - ఆడవాళ్ళు

"ఆవిడకేం, అదృష్టవంతురాలు. నలుగురూ కొడుకులే" అంటారు అనసూయమ్మ గురించి, అక్కడికి కూతుళ్ళని కన్న వాళ్ళంతా పాపాత్ములై పోయినట్టు.

"అందరికీ వుంటారు కొడుకులు ఎందుకూ 'తల్లికి పెట్టరా తద్దినం' అని. ఆవిడ అదృష్టం అంతా కొడుకులు తల్లి గీసిన గీటు దాటక పోవడం" అంటారు వాళ్ళని బాగా తెలిసినవాళ్ళు.

వీళ్ళు కాక ఆవిడ అదృష్టానికి చిహ్నంగా ఆవిడకి నెలకి వెయ్యి రూపాయలు అద్దె తెచ్చే రెండంతస్తుల మేడా, ఒంటి మీద ఓ వందకాసుల బంగారం, నలుగురు కొడుకులకీ— ఒక్కొక్కడికి లక్షన్నర చొప్పున అధమం ఆరులక్షలు-కట్నం తీసుకోవాలన్న కోరికకూడా ఉన్నాయి.

"పాపం. ఎన్నివుండి ఏం లాభం, కట్టుకున్న మొగుడు లేకపోయేక" అని ఎవరయినా జాలిపడితే "పోన్లెస్తురూ, చచ్చి పోవడం కాదుగానీ బతికేడనుకోండి మహానుభావుడు. అతన్ని కూర్చోనిచ్చిందా? నిల్చోనిచ్చిందా?" అంటారు కిట్టనివాళ్ళు.

ఎవరెలా అనుకున్నా ఆవిడకొచ్చే కష్టంగానీ నష్టంగానీ

ఏఁపేఁ వుండవు నలుగురు కొడుకులూ ఆవిడకి నెలనెలా డబ్బు పంపినంతకాలం. "ఆఁ రేపు పెళ్ళయితే యింకేం పంపిస్తారు? ఎవడి సంసారం వాడికే సరిపోతుంది." అన్న విషయం ఆవిడకి తెలీదంటారా? అంచేతేకదా పెద్దకొడుకు అమెరికాలో ఆరేళ్ళనుంచి ఆటోమొబైలు యింజనీరుగా లక్షలు గడిస్తున్నా యింతవరకు పెళ్ళిమాట ఎరగడు. "అమ్మా! నాకు పెళ్ళిచెయ్యి" అని అడిగేవరకూ చెయ్యదా? అంటారా? ఎంత మాట. ఆ కొడుకులు అలా భీష్ముల్లాగా వుండిపోతారుగాని తల్లిని ఆ మాట అడగరు అంత బుద్ధిమంతులు. (అది కేవలం లేక చేతకానీ తనమా?) అతనికి ముప్పైఏళ్ళునిండి మూడేళ్ళ యింది.

"మా పెద్దాడికి పెళ్ళి సేపెయ్యాలనుకుంటున్నాను" అన్నమాట విన్నవాళ్ళందరూ మూడో ప్రపంచయుద్ధం వస్తుందన్నంత ఆశ్చర్యపడేరు. అవును మరి ఏ వయసుకా ముచ్చట జరిగితేనే అందం" అన్నారు నాలాంటివాళ్ళు. దాని కావిడ "ముచ్చటా కాదు. ముద్దూకాదు. అమెరికాలో యీ మధ్య పెళ్ళికానివాళ్ళకి టాక్సులు చాలా వేస్తున్నారు. అబ్బాయి ఆర్జనలో సగం టాక్సకిందే పోతోంది. మరంచేత పెళ్ళిచేస్తే టాక్సు తగ్గుతుంది" అని కొడుకు పెళ్ళిలోగల కిటుకు క్లారిఫై చేసింది.

ప్రపంచంలో పెళ్ళిగురించి చాలామంది మహానుభా

22)

వులు చాలా రకాలుగా నిర్వచనాలు శెలవిచ్చేరు. కానియింత చక్కటి నిర్వచనం ఎవరూ యివ్వలేదేమో!

పెళ్ళిచూపులు, యిచ్చిపుచ్చుకోవడాలు వగైరాలన్నీ తల్లినే చూసుకోమన్నాడు కొడుకు. పెళ్ళికి మూడ్రోజులు ముందువచ్చి మూడుముళ్ళు వేస్తాడు. అంతే. అమ్మాయి అందంగావున్నా ఫరవాలేదు. కాని ఆడవాళ్ళ అందం ఎంత కాలముంటుంది. యిద్దరు పిల్లలు పుట్టగానే రంభయినా రాచ్చిప్పలా అయిపోతుంది. ఎంత చదువున్నా ఒకటే. ఉద్యోగం చెయ్యనక్కర్లేనప్పుడు. మరంచేత డిగ్రీ సగంలో వున్న ఓ చామనచాయ రంగు అమ్మాయి లక్షాపాతిక వేలు కట్నంతో నచ్చింది.

"వెధవది. ఆ మధ్య అబ్బాయికి నాలుగురోజులు వంట్లో బావులేకపోతే తిరపతిలో పెళ్ళిచేస్తానని" మొక్కుకుందావిడ. అంచేత ఉభయఖర్చులూ పెట్టుకొని పెళ్ళి తిరపతిలో చేశారు పిల్లగలవాళ్ళు. "ఆడపిల్లలు లేరనుకోండి. అయినా చెల్లెలి పిల్లలున్నారుకదా. వాళ్ళు ఉసూరు మనరూ" అంచేత ఆవిడ చెల్లెలి కూతుళ్ళకి ఆడపడుచు లాంఛనాలు యిచ్చేరు ఒడికట్టు బియ్యం పేరుకి పిడికెడు కట్టినా విడిగా ఓ బస్తాయివ్వడం ఆచారం. అందులో ఓ పదితులాల వెండిగిన్నె పెట్టి కాళ్ళు కడిగే చెంబు, స్టీలువే (సాంప్రదాయం ఒప్పకపోయినా) పాన కాల బిందెలు, అలక పాన్పుమీదో స్కూటరు వగైరాలు వుండనేవుంటాయి.

మరైతే స్నాతకంలో బావమరిది గడ్డం పట్టుకొని "కాశీ వెళ్ళొద్దు, మా అక్కనిస్తాం" అని బలిమాలినప్పుడు అతనికి బట్టలు పెట్టాలి పెళ్ళికొడుకు.

"ఛ. ఛ. మాకు ఆచారంలేదు" అన్నారు ఆవిడ.

పెళ్ళయిన వెంటనే పిల్లను తీసుకుపోతానన్నాడు ఇన్నాళ్ళకి తనకో పెళ్ళాం దొరికినందుకు ముచ్చటపడ్డ కొడుకు.

"ఇక్కడ ఒక్కర్తినూ వుండలేక చస్తున్నాను, పైగా అక్కడ దేశంకాని దేశంలో కోడలు ఒంటరిగా ఎలావుంటుంది! అంచేత యిద్దరికీ పాస్‌పోర్టులు, అవీ పంపించు. ఒక్కసారే వచ్చేస్తాం" అన్న తల్లిమాటలకు గంగిరెద్దులా బుర్రూపి ప్లేనెక్కేసిన అబ్బాయిని చూసి తెల్లబోయింది కోడలుపిల్ల.

పెళ్లై పదినెలలు దాటినా యింకా పాస్‌పోర్టు గొడవలు తేలలేదు. మరంచేత అత్తగారి పక్కనే (పక్క మంచంమీదే) పడుకుంటోంది కోడలు బుద్ధిగా.

ఇందులో అతిశయోక్తిలేదు. అబద్ధం అరసున్నకూడా లేదు.

నాకూ తమ్ముళ్ళున్నారు, కొడుకులున్నారు, కన్నతల్లిని గౌరవించవద్దనే తెలివితక్కువతనం లేదు నాకు. కాని ఆ గౌరవం ఎంతవరకు వాళ్ళివ్వాలి? ఎంతవరకు వీళ్ళు నిలబెట్టుకోవాలి?

"వీడిని పెంచి, పెద్దచేసి, చదువు చెప్పించడానికి బోలెడు డబ్బయింది. మరి ఆ డబ్బు ఎవరిస్తారు?" ఎందు

కివ్వాలి? డబ్బే కావాలనుకున్న వాళ్ళు పిల్లల్ని కనడం మానేస్తే సరి. చదువు చెప్పించడం మానేసి గోచీపెట్టి వదిలేస్తే సరి. గొడ్లు తోలుకుంటాడు. నా కొడుకుని చదివించటం కోడలికి కూడు పెట్టడానికా? మరి అమ్మాయిలు మాత్రం చదువుకోవడం లేదూ? ఆ డబ్బెవరిస్తారు? పైగా అంత డబ్బుపోసి చదివిస్తే ఆ తరువాత ఆర్జనంతా అణాపైసాల్తో సహా అత్తారికే పెడుతుంది కాని ఏ అమ్మాయీ తల్లికో అర్ధరూపాయి యివ్వదు.

'డబ్బు' అనేది వ్యాపార పదం. కొనడానికీ, అమ్మడానికీ పనికొచ్చే పదార్థం. డబ్బుఒకరికిస్తే ఏదో ఒకటికొంటాం. పుచ్చుకుంటే ఏదో ఒకటి అమ్ముతాం. అబ్బాయి అమ్మాయి దగ్గర డబ్బు తీసుకున్నాడంటే అతను తనువు, మనసు, చదువు, ఉద్యోగంతో సహా అమ్ముడుపోయినట్టే. ఆ ప్రకారం అబ్బాయి పెళ్ళయిన తరవాత తన సంపాదనంతా అత్తారికిచ్చేవలసిందే మానాభిమానాలున్న మగవాడైతే.

పెళ్ళయిన అమ్మాయిలంతా తమ ఆర్జనంతా అమ్మకిచ్చేసి చూడండి. అఫ్‌కోర్స్ అప్పుడు ఏ మగాడూ పెళ్ళాన్ని వుద్యోగం చెయ్యనివ్వడు. మరీ మంచిది. వాడు తెచ్చినదేదో తింటూ హాయిగా పడుకోవచ్చు.

అసలు పెళ్ళిళ్ళ ఆచారాలు, లాంఛనాలు, నోములు, వ్రతాలు, పురుళ్ళు, పుణ్యాలు వగైరాలన్నీ ఆడవాళ్ళు పెట్టుకున్నవే అంటే ఎవరూ కోపం తెచ్చుకోనవసరంలేదు. శ్రావణ

మంగళవారాలవల్ల, వరలక్ష్మి వ్రతాలవల్ల ఎంత పుణ్యం వస్తుందో తెలీదుకాని, "పెళ్ళయిన మొదటేడాదికదా, మరీ అంత దిగదుడిచినట్టు అరకాసు బంగారంతో అయిందనిపించే సిందేవిటే మీ అత్తగారు" అనో, "శ్రావణ మంగళవారం నోముకి ఓ వందరూపాయలిచ్చి పట్టుచీరైనా కొనలేదా మీ అమ్మ" అనో ఒకరినొకరు దెప్పుకోవడం మాత్రం మానలేదు.

ఏ మాట కామాటే చెప్పుకోవాలి యీ ఆచారాలతోను, లాంఛనాల్తోను సాధారణంగా మగవాడికి నిమిత్తం లేదు. "యాచకో యాచకః శత్రు" అన్నట్లు ఆడదే శత్రువైతే ఎలా? ప్రతి ఆడదీ తన చిన్నతనం మర్చిపోతుందేం? తనుపడిన కష్టాలు, బాధలు తన కూతురు, కోడలు పడకూడదనుకోదేం? ప్రతి తల్లి ఒకప్పుడు కూతురే. ప్రతి అత్త ఒకప్పుడు కోడలే.

ఇంటగెలిచి రచ్చగెలవాలి. అంచేత ముందు మనల్ని మనం బావుచేసుకొంటే ఆ మగవాడి పిలక పట్టుకోవచ్చు. ఏవంటారు? ★